## క్లుప్తంగా

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి

**మాడుగుల రూరల్:** రైతులు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సర్పంచ్ జామి రమణబాబు అన్నారు. కె.జె.పురం సచివాలయంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాముతో కలిసి ఆయన శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికిగాను 100 కిలోలు ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,203, బీ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,183 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రకారం రైతులు వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, నాయకులు ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, ఆడారి గణేశ్, ఎం.వి. సత్యనారాయణ, మాలి నాయుడు, వ్యవసాయ శాఖ సహాయకురాలు ఎస్. శ్రావణి, పీఏసీఎస్ సీఈవో కాళ్ల ఈశ్వరరావు, లావణ్య, ఆడారి శంకర్, అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



డిప్యూటీ సీఎం బూడిని కలిసి కండువా కప్పుతున్న స్వామినాయుడు

**చీడికాడ:** అందరిని కలుపుకుని పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. బైలపూడికి చెందిన గొల్లవిల్లి స్వామినాయుడును వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడిగా రెండోసారి నియమించారు. ఈ సందర్భంగా ఆయన తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. తనను తిరిగి నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, కో–ఆపరేటివ్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, ఎంపీపీ భర్త కురచా నారాయణమూర్తి, తురువోలు ఉప సర్పంచ్ పి.టి.బాబు, నాయకులు జె.ఈశ్వరరావు, గాడి దేవినాయుడు, గొల్లవిల్లి రమేష్‌నాయుడు, పండు, గుమ్మాల తారకేసు, పాటూరి రమణ పాల్గొన్నారు.

### వెలుగు వీవోఏపై విచారణ



రాచపల్లిలో విచారణకు హాజరైన డ్వాక్రా మహిళలు

**మాకవరపాలెం:** వెలుగు వీవోఏపై అందిన ఫిర్యాదుతో విచారణ చేపట్టారు. రాచపల్లి గ్రామానికి చెందిన వీవోఏ డ్వాక్రా మహిళల వద్ద రుణాల మంజూరు సమయంలో వసూళ్లకు పాల్పడుతుందని కలెక్టర్‌తోపాటు ఇన్‌చార్జి ఎంపీడీవో ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో నర్సీపట్నం నుంచి వచ్చిన నలుగురు వెలుగు సీసీ ఇక్కడ గ్రామ సచివాలయంలో విచారణ చేశారు. 50 సంఘాల్లోని డ్వాక్రా మహిళలను విచారించారు. వీరు తీసుకున్న రుణాలు, చెల్లింపులపై వివరాలు సేకరించారు. మరో వారంపాటు విచారణ కొనసాగుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

### కల్వర్టు రక్షణ గోడను ఢీకొన్న ట్రాక్టర్

**చోడవరం:** అదుపుతప్పి కల్వర్టు గోడను ట్రాక్టర్ ఢీ కొనడంతో శుక్రవారం ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలిగింది. వెంకన్నపాలెం–చోడవరం రోడ్డు(బీఎస్ రోడ్డు)లో వెంకన్నపాలెం నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి పెద్ద మదుం రక్షణ గోడను ఢీకొట్టింది. గోడను ఢీకొట్టి కాలువలో ట్రాక్టర్ కొంతభాగం వెళ్లడంతో జేసీబీ సాయంతో తీశారు. ఈ ప్రమాదం వల్ల గంట సేపు బీఎస్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విశాఖపట్నం – చోడవరం, మాడుగుల, పాడేరు, అనకాపల్లి– చోడవరం రాకపోకలు సాగించే వాహనాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్‌లో అంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే చోడవరం పోలీసులు వచ్చి ట్రాక్టర్‌ను అక్కడ నుంచి తొలగించడంతోపాటు రేడియం స్టిక్కర్లు వేశారు.



# పోటాపోటీగా..



రావికమతంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళలు

గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం – ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతున్నాయి. కబడ్డీ, వాలీవాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడా పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మహిళలకు, పురుషలకు వేర్వేరుగా విద్యా శాఖ అధికారులు, పీడీలు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతున్నాయి. వీటిని తిలకించేందుకు వీక్షకులు సైతం పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

● ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులు

**కె.కోటపాడు/దేవరాపల్లి:** ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణతో యువతలో క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని కె.కోటపాడు, గొండుపాలెం పీడీలు రోహిణి, లక్ష్మి తెలిపారు. కింతాడలో ఖో–ఖో, గొండుపాలెంలో వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నారు. కె.కోటపాడు మండలంలో 22 పంచాయతీల్లో ఆడుదాం..ఆంధ్రా పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు తరలివచ్చి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నారు. దేవరాపల్లి మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ పోటీలు నిర్వహించారు.



దేవరాపల్లిలో కబడ్డీలో తలపడుతున్న యువతలు

**రావికమతం:** స్థానిక హైస్కూల్‌లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 16 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీలో యువకులు పోటీపడ్డారు. కొత్తకోట హైస్కూల్‌లో కబడ్డీ, షటిల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది సహాయ సహకారాలందిస్తున్నారు.



దేవరాపల్లిలో రసవత్తరంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

**రోలుగుంట:** మండలంలో 16 సచివాలయాల పరిధిలో శుక్రవారం ఖో ఖో పోటీలు నిర్వహించారు. 32 జట్లు పోటీపడి తమ ప్రతిభ చాటాయి. ఈ పోటీలను ఈవోపీఆర్డీ కె.నూకరాజు పీఈటీలతో కలసి పర్యవేక్షించారు.

**మాడుగుల రూరల్:** మండలంలో 23 గ్రామ సచివాలయాల పరిధిలో కె.జె.పురం, ముకుందపురం, వీరవల్లి, పోతనపూడి, ఎం. కోటపాడు, తదితర సచివాలయాల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించారు. కె.జె.పురం హైస్కూలు పీఈటీ కె. ప్రసాదు, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనా కుమారితోపాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**నాతవరం:** మండలంలో 17 గ్రామ సచివాలయాల్లో పోటా పోటీగా క్రీడలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా మహిళలు మధ్య ఆటల పోటీలు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మండల వ్యాప్తంగా పోటీలను ఎంపీడీవో హ నుమంతరావు, ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు పర్యవేక్షిస్తున్నారు.



కె.కోటపాడు: కింతాడలో ఖో-ఖో పోటీలు



నాతవరంలో వాలీబాల్ ఆడుతున్న మహిళలు



రోలుగుంట: కెనాయుడుపాలెంలో ఉత్సాహంగా ఖో..ఖో..ఆడుతున్న ఆటగాళ్లు



గొలుగొండ: ఏఎల్‌పురంలో ఖో-ఖో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



మాడుగుల రూరల్: ముకుందపురంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

**గొలుగొండ:** మండలంలో 20 గ్రామ సచివాలయాల పరిధిలో ఉత్సాహంగా పోటీలు నిర్వహించారు. గొలుగొండ గురుకుల కళాశాల ఆవరణలో క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. జోగుంపేట జట్టు గెలుపొందింది. ఏఎల్‌పురంలో ఖో–ఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

## పాడి రైతుల జీవనోపాధులకు రుణాలు

విశాఖ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ నందిని సాహు

**రోలుగుంట:** పాడి రైతులకు, గొర్రెలకాపరుల జీవనోపాధుల కోసం విశాఖ గ్రామీణ వికాస్ బ్యాంకు తక్కువ వడ్డీకి రుణాలిచ్చి ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని మేనేజర్ నందిని సాహు తెలిపారు. స్థానిక విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాలకేంద్రం –2లో పాడి రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తమ శాఖ ద్వారా ఇస్తున్న రుణాలు, వాటి వినియోగం, వడ్డీ రాయితీపై ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రుణాలు వాయిదాల పద్ధతిలో ఎలా చెల్లించాలి, క్రమపద్ధతిలో రుణాలు చెల్లించిన వారికి మరలా రుణాలు ఇస్తామన్నారు. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ జీవనోపాధులు మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గురుస్వామి, మోనటరింగ్ అధికారి పి.సాయికిరణ్, పాలకేంద్రం అధ్యక్షుడు శెట్టి శ్రీను, కార్యదర్శి మడ్డు వాసు, పాడి రైతులు పాల్గొన్నారు.



ఖాతాదారుల సమావేశంలో బ్యాంకు అధికారులు

## ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆర్.వి.ఎస్.ఆర్. శర్మ



**రోలుగుంట:** ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆర్.వి.ఎస్.ఆర్. శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈయన సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు అతని సేవలకు గుర్తింపుగా ఎన్నుకున్నట్టు యూనియన్ స్టేట్ ఎన్నికల పరిశీలకుడు సాల్మన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శర్మ ఎన్నిక పట్ల యూనియన్ మండలాధ్యక్షుడు పి.రమణ, ప్రధాన కార్యదర్శి బోనెల రాము, ప్రధాన సలహాదారుడు కె.అశోక్ సామ్రాట్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## మాడుగుల ఏఎంసీ కమిటీ ప్రమాణ స్వీకారం

**మాడుగుల:** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శానాపతి కొండలరావుతోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చోడవరం, నర్సీపట్నం ప్రాంతాల్లో మార్కెట్టు కమిటీ ఉండేదన్నారు. అత్యధిక వ్యవసాయ ఉత్పత్తులు కలిగిన మాడుగులలో మార్కెట్ కమిటీ లేకపోవడంతో సన్న, చిన్నకారు రైతులతోపాటు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయేవారన్నారు. ఈ విషయం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లడంతో నూతన కమిటీ ఏర్పాటు కృషి చేశారన్నారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీకి ముఖద్వారం అయిన నర్సీపట్నంలో 25 శాతం వ్యవసాయ ఉత్పత్తులు ఉంటే, మాడుగులలో 75 శాతం ఉన్నాయని, పసుపు, పిప్పళ్లు ఉత్పత్తులు అక్కడ 20 శాతం ఉంటే ఇక్కడ 80 శాతం ఉన్నాయన్నారు. మాడుగుల ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో, మైదాన ప్రాంతంలో పండించే వాణిజ్య పంటలు ఇక్కడకు వస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మాడుగులలో ఐదెకరాల స్థలం కేటాయించాలని కోరారు. ఎంపీపీ రామధర్మజ మాట్లాడుతు ఈ కమిటీ ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, విక్రయం మరింత సులభతరం కానుందని హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, పార్టీ పట్టణాధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కుక్కర మహేశ్వరి, సర్పంచ్ యడ్ల కళావతి, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎం. కోటపాడు, వల్లాపురం ఉప సర్పంచ్‌లు గంగాధర్, రాము, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామమూర్తి, సత్తిబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.



డైరెక్టరులతో కలిసి నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శానాపతి కొండలరావు

**బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్లు**

ఏఎంసీ డైరెక్టర్లు భీశెట్టి జగ్గప్పారావు, పరువాడ నాయుడు, దొండా నాగమణి, కొల్లి కృష్ణవేణి, రాజి నాగ వెంకట సుబ్బలక్ష్మి, సయ్యపురెడ్డి నారాయణరావు, శీరా సన్నెమ్మ, నందారపు అప్పల సత్యనారాయణ, బుడతల అప్పయ్యమ్మ, వేచలపు మౌనిక వెంకట క్రాంతి కుమారి, దొమ్మంగి సన్యాసమ్మ, నూతిగట్టు నాగశంకర్, బసవ రామపరమేశ్వరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎంతోపాటు డిప్యూటీ సీఎంకు నూతన పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

## లంకవానిపాలెం అభివృద్ధికి ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గ్రామస్తుల సన్మానం

**కె.కోటపాడు:** లంకవానిపాలెం గ్రామాభివృద్ధికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అందిస్తున్న సహకారం మరువలేనిదని సర్పంచ్ వేచలపు దొరబాబు అన్నారు. గ్రామస్తులతో కలిసి ఆయన తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, రూ.20 లక్షలతో 30 వేల లీటర్ల అదనపు మంచినీటి పథకం, జలజీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు, రూ.1.67 కోట్లతో పీహెచ్‌సీకి నూతన భవన నిర్మాణాలు పూర్తి చేసినట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించిన ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెక్కల గోపి, ఉప సర్పంచ్ కె.లక్ష్మి, వార్డు సభ్యులు చిన్నమ్మలు, వత్రి రమణమ్మ, పెంటయ్య పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం బూడిని దుశ్శాలువాతో సన్మానిస్తున్న సర్పంచ్ దొరబాబు, తదితరులు

**శోభాయాత్రకు ఆహ్వానం**

**దేవరాపల్లి:** అయోధ్య రామాలయం నుంచి దేవరాపల్లి మండలానికి ఆదివారం రానున్న అక్షింతల ఊరేగింపు శోభాయాత్రకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ అక్షింతలు గ్రామ పెద్దలంతా ఐక్యతగా ప్రజలకు పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలని కమిటీ సభ్యులు కోరారు. డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, భీమవరపు కోటేశ్వరరావు, కె.వి.రమణ, కొరుపోలు శ్రీను, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మంత్రుల బృందం పరిశీలన



వైద్య కళాశాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, తదితరులు

**మాకవరపాలెం:** వైద్య కళాశాల నిర్మాణ పనులను సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరవుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలించనున్నారు. భీమబోయినపాలెం వద్ద రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులను శనివారం నర్సీపట్నంలో బస్సుయాత్రకు హాజరయ్యే రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలించనున్నారు. అనంతరం ఇక్కడే మీడియా సమావేశంలో మాట్లాడుతారని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. ఇక్కడి ఏర్పాట్లను ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రాజారావు, పార్టీ నేతలు ఉన్నారు.

## అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

**దేవరాపల్లి:** అవినీతికి తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు తెలిపారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం బోయిలకింతాడలో ఆయన ఆయుష్మాన్ కార్డులను, మన సంకల్పం వికసిత్ భారత్ క్యాలెండర్లను అందజేశారు. ప్రజలంతా పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, ఓబీసీ జిల్లా ఇన్‌చార్జి భరిణికాన అప్పలకొండ కుమార్, మేడపురెడ్డి శ్రీనువాసు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము, ఏవో వైకాంతమ్మ, ఏపీఎం ఎస్ ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి గోవిందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పాల్గొన్నారు.



బోయిలకింతాడలో మహిళలకు క్యాలెండర్లను అందజేస్తున్న బూరె బాబూరావు

## భూ రీసర్వేలో నిర్లక్ష్యం చేయొద్దు

**నాతవరం:** ఏ ఒక్కా రైతు నుంచి ఫిర్యాదు రాకుండా జగనన్న భూ రీసర్వే నిబంధనలు అనుసరించి చేయాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రీసర్వేపై సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఇంతవరకు మండల వ్యాప్తంగా 16 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయిందన్నారు. మిగతా గ్రామాల్లో విడతలు వారీగా రీసర్వే చేస్తున్నామన్నారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు ఆన్‌లైన్ పాసుపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. రీసర్వే చేయడం వల్ల ఏళ్ల తరబడి వెంటాడే భూసమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. గ్రామాల్లో భూఆక్రమణల బాధ్యత వీఆర్వోలదేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. స్పందన అర్జీలపై వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రవి, చైన్లు, మండల సర్వేయరు బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

## న్యాయవాదుల నిరసన దీక్షలు

**చోడవరం రూరల్:** ఏపీ భూహక్కుల చట్టం సెక్షన్ 27 ఆఫ్ 2023 రద్దు చేయాలని న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఆచార్య నన్నయ్య యూనవర్సిటీ పూర్వ వీసీ ముద్రు ముత్యాలనాయుడు, ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్ వీరికి మద్దతు పలికారు. స్థానిక కోర్టుల సముదాయం ఆవరణ సమీపంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ నూతన చట్టం కారణంగా భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లుతుందని న్యాయవాదులు పేర్కొంటున్న అంశం పట్ల ఏకీభవించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, కార్యదర్శి గొర్లె కృష్ణవేణి, న్యాయవాదులు మంథా గౌరీశంకర్, తదితరులు పాల్గొన్న దీక్షలకు బైరా ఫౌండేషన్ బ్రహ్మనాయుడు, విశ్రాంత ఆర్జేడీ తిరుమలరావు మద్దతు పలికారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం అందజేశారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ఉద్యమిద్దాం

సీడ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి

**దేవరాపల్లి:** బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి కోరారు. గ్రామ సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శి ఎం. సంధ్యారాణి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కైరళి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉషారాణి, సంధ్యారాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అందరం సమష్టిగా ఉద్యమిద్దామని సూచించారు.



విద్యార్థులకు వివరిస్తున్న సీడ్ ఆర్గనైజేషన్ డీసీవో ఉషారాణి, సంధ్యారాణి

## వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిక అవాస్తవం

**మాడుగుల రూరల్:** సామాన్యులు, స్వయం సహాయక సంఘాలు సభ్యులకు కండువాలు కప్పి, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డాపు భాస్కరరావు, నాయకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఒమ్మలిలో వారు మాట్లాడుతూ గ్రామంలో తమడచెరువుకు చెందిన ఉగ్గిన శ్రీనివాసరావు, ఉగ్గిన గుణలక్ష్మి, ఉగ్గిన లక్ష్మి, ఉగ్గిన భూలోకమ్మ, శానాపతి రాజులమ్మ, కొండపల్లి దేముడమ్మ, ఉగ్గిన వరహాలమ్మ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సమక్షంలో టీడీపీలో చేరలేదన్నారు. వారంతా వైఎస్సార్ ఆసరా బయోమెట్రిక్ వేయడానికి స్థానిక నూకాంబిక దేవాలయం వద్ద ఉండగా, వారిని పార్టీలో చేరినట్టు ప్రకటించారన్నారు. దివ్యాంగురాలు ఉగ్గిన లక్ష్మి ఫిజియోథెరపీ కోసం ఆస్పత్రికి వెళ్లిందని, లేని వారి పేర్లు పార్టీలో చేరారని చెప్పడం సిగ్గుచేటన్నారు. మిగిలిన వారు తమ పార్టీకి చెందిన వారు కాదని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ కన్వీనర్ పుసర్ల బుజ్జి, పాల సొసైటీ డైరెక్టర్లు కర్రి నాగేశ్వరావు, పూసర్ల దుర్గునాయుడు, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు కొండపల్లి నర్సింహమూర్తి, పూసర్ల శ్రీను, సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొడ్డాపు భాస్కరరావు, పార్టీ నాయకులు

## పేదల సంక్షేమానికి పెద్ద పీట

**నాతవరం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర భాగంగా శుక్రవారం చినగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం జగన్ ఇంతవరకు చేసిన అభివృద్ధి, సంక్షేమంపై వివరిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుస్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. సర్పంచులు అంకంరెడ్డి నూకాలమ్మ, గుడపర్తి సీతయ్యమ్మ, ఏవో శైలజ, గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్. చక్రధర్‌బలిజీ, వెలుగు ఏపీఎం మత్రి లక్ష్మి, పి.కె.గూడెం పీఏసీఎస్ డైరెక్టరు గుడపర్తి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంకంరెడ్డి పాలురాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, బీజేపీ మండల నాయకుడు గవిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు